నవతెలంగాణ
ఆదిలాబాద్
1
శుక్రవారం | సెప్టెంబర్ 08, 2023 | www.navatelangana.com

ఎస్సై అభ్యర్థికి ఫైర్ సిబ్బంది సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అగ్నిమాపక శాఖలో ఫైర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ సివిల్ ఎస్ఐగా ఎంపికైన సాయి త్రిలోక్‌నాథ్‌రెడ్డిని గురువారం ఫైర్‌స్టేషన్ ఆవరణలో సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఎ కేశవులు, ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ శివాజీ, సూపరింటెండెంట్ ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ రహీముద్దీన్ ఉన్నారు.



కేసీఆర్, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-సిరికొండ

సోంపల్లి గ్రామం నుండి మండల కేంద్రానికి వెళ్లేందుకు బిటి రోడ్డు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ చిత్రపటాలకు గురువారం సొంపల్లి గ్రామంలో పాలాభిషేకం చేశారు. మండల కేంద్రానికి వెళ్లేందుకు దాదాపుగా రెండు కోట్ల30లక్షల నిధులతో బిటి రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపి మంజూరు చేయించిన ఎమ్మెల్యే బాపురావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణంతో దూరభారం తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కదం సూర్యకాంత్, ఈశ్వర్, గడ్డం కిషన్ పాల్గొన్నారు.



చేరికలే లక్ష్యంగా..!

- అసంతృప్తులు..ఇతర పార్టీల వారిపై ప్రత్యేక దృష్టి
- గ్రామాలు..వార్డుల్లో చురుకైన వారి కోసం అన్వేషణ
- పదవులు..తాయిలాలు ప్రకటిస్తూ చేర్పిస్తున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న చేరికల పర్వం
- ఎన్నికల్లో గట్టెక్కడం కోసం ప్రధాన పార్టీల ఎత్తుగడ

ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయ పార్టీలు మరింత దూకుడు పెంచుతున్నాయి. కొత్త వారి చేరికలే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నాయి. నెల రోజుల ముందు నుంచే వలసల రాజకీయం మొదలైనా..గత వారం రోజుల నుంచి ఈ పరిణామాలు మరింత అధికమయ్యాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు ఇతర పార్టీలు సైతం వీటిపైనే ప్రధానంగా దృష్టి సారించాయి. గ్రామాలు, వార్డుల వారీగా ప్రజలతో మంచి సత్సంబంధాలు కలిగిన యువత, వివిధ పార్టీల నాయకుల కోసం అన్వేషణ సాగిస్తున్నాయి. వారి గురించి వాకబు చేసి స్థానికంగా ఉండే నాయకుల ద్వారా పార్టీల్లో చేరేలా ప్రణాళికలు రచిస్తున్నారు. భవిష్యత్తులో పదవులు ఆశచూపుతూ..తాయిలాలు ప్రకటిస్తూ పార్టీలో చేర్పించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ వారం రోజుల నుంచి ఎటు చూసినా చేరికల కార్యక్రమాలే కనిపించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఎమ్మెల్యే రామన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరికలు(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో మరో మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు ఎన్నికల బరిలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నాయి. బలాబలాలను బేరీజు వేసుకుంటూ బరిలో నిలిచేలా వ్యూహరచన చేస్తున్నాయి. ముఖ్యంగా ఆయా పార్టీల తరుపున బరిలో నిలిచేందుకు సిద్ధమైన ఆశావహులు ఎవరికి వారు కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు ఉండగా బీఆర్ఎస్ నుంచి అన్ని స్థానాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ టికెట్ల కోసం ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నారు. బీజేపీ నుంచి బరిలో నిలిచేందుకు పలువురు అభ్యర్థులు ఆ పార్టీ అధిష్టానానికి దరఖాస్తులు చేసుకుంటున్నారు. మరికొన్ని రోజుల్లోనే బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరనేది తేలిపోనుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. గ్రామాలు, వార్డుల వారీగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఔత్సాహికులను గుర్తించి పార్టీలో చేర్పించుకునే కార్యక్రమాలు చేపడుతున్నారు. రాజకీయాల్లో చురుగ్గా ఉన్న వారికి భవిష్యత్తులో పదవులు కట్టబెడుతామని భరోసా ఇస్తూ చేర్పించుకోగా.. మరికొందరికి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రాధాన్యం ఇస్తామని..లేదంటే వివిధ రకాల ప్రయోజనాలు కల్పిస్తామని ఆశలు రేకెత్తిస్తూ పార్టీలో చేరేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. మరోసారి అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నాయకులు చెబుతుండగా.. ఈ సారి కచ్చితంగా తామే అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. బీజేపీ కూడా అధికారంలోకి వస్తామనే ఆశలు కల్పిస్తూ చేరికలను ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది.

చేరికలే లక్ష్యంగా కార్యక్రమాలు..!

ప్రస్తుతం ప్రధాన పార్టీలన్నీ కేవలం కొత్తగా చేరికలపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు సైతం రోజువారీగా ఇవే కార్యక్రమాలు చేపడుతున్నాయి. అధికార పార్టీ అభ్యర్థులు ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై దృష్టిసారించగా.. ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీలో అసంతృప్తులపై ప్రధానంగా దృష్టిసారిస్తూ వారితో మంతనాలు సాగిస్తూ పార్టీలో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, ఖానాపూర్, చెన్నూర్‌లో కాంగ్రెస్ నుంచి పలువురు ముఖ్య నాయకులు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా.. మంచిర్యాల, ఖానాపూర్‌లో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కేవలం పార్టీల నాయకులే కాకుండా గ్రామాలు, వార్డుల్లోనూ ప్రజలు ఆయా పార్టీల్లో చేరుతున్న కార్యక్రమాలు అధికమయ్యాయి. ఎన్నికల నాటికి ఈ పరిణామాలు మరింత ఎక్కువయ్యేలా కనిపిస్తున్నాయి. పార్టీలు కొత్త వారి చేరికల ద్వారా తమ బలాన్ని పెంచుకుంటూ ప్రజల దృష్టిని ఆకర్షించే పనిలో పడ్డాయి. ఎంత ఎక్కువ మంది చేరితే పార్టీకి అంత ఊపు వస్తుందని బరిలో ఉండే అభ్యర్థులు భావిస్తున్నారు. ఎన్నికల్లో గట్టెక్కడమే లక్ష్యంగా ఆయా పార్టీలు వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు సాగుతున్నాయి. ఈ పరిస్థితి గమనిస్తే ఎన్నికల నాటి వరకు ఎవరు ఏ పార్టీలో ఉన్నారో కూడా తెలియని పరిస్థితి కనిపిస్తోంది.



నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరికలు(ఫైల్)

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరస్వతి
- జిల్లా కేంద్రంలో భారత్ జోడోయాత్ర వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారత్ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆసిఫాబాద్ మాజీ సర్పంచ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరస్వతి అన్నారు. భారత్ జోడోయాత్రకు సంవత్సరం పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో వార్షికోత్సవం పేరుతో ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత్ జోడో యాత్రతో దేశంలో కొత్త శకం ప్రారంభమైందన్నారు. బిజెపికి వణుకు పుట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్, మండల అధ్యక్షులు మసాదే చరణ్, సీనియర్ నాయకులు అసద్, శివరాం నాయక్, జమీర్, కళావతి, మేకర్తి శ్రీనివాస్, పిప్రే మహేష్, అర్షస్, జాడి సురేష్, గంగారాం, బాలు పాల్గొన్నారు.



జైనూర్ : ప్రత్యేక తెలంగాణ ఇచ్చి తెలంగాణ ప్రజలకు న్యాయం చేస్తూ రాబోయే రోజుల్లో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ పాత్ర ఎంతో కీలకమని కాంగ్రెస్ ఎస్‌సీసెల్ జిల్లా అధ్యక్షుడు కుడిమెత విశ్వనాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సయ్యద్ ముకీద్, సుద్దాల శ్రీనివాస్, అయూబ్‌ఖాన్‌తో కలిసి భారత్ జోడో యాత్ర సంవత్సరం పూర్తయినందున ప్రత్యేకంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ జుడేగా ఇండియా జీతేగా అనే నినాదంతో కాంగ్రెస్ ముందుకెళ్తుందని తెలిపారు. దేశంలో ఇప్పటివరకు ఎవరూ చేయని విధంగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యకుమారి వరకు 4080 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. ఆనాడు సోనియాగాంధీ తెలంగాణ తల్లిలా ప్రత్యేక తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించపజేశారని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ మందాడి లింగు, ఎస్ఎస్‌యూఐ మండల నాయకుడు అడ అమృత్, అయూబ్ పఠాన్, విశ్వనాథ్, దత్తు, అయూబ్‌ఖాన్, హైమద్‌ఖాన్, శ్రీకాంత్, మనోజ్ పాల్గొన్నారు.



ఆర్‌కేసీహెచ్‌పీ గనిని సందర్శించిన మెకానికల్ ఇన్స్‌పెక్టర్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్‌కేసీహెచ్‌సీ గనిని మెకానికల్ ఇన్స్‌పెక్టర్ డీడీఎంఎస్ అర్ముగం సందర్శించారు. గనిలోని మెకానికల్ పరికారల రక్షణ, మెయింటనెన్స్ విధాన సిస్టంను తనిఖీ చేశారు. మెకానికల్ ఎస్‌టపీ సీటపీ లోటో సిస్టంను పరిశీలించి సూచనలు చేశారు.ప్రతి పనిని సరైన దిశలో ఖచ్చితమైన పద్ధతిలో విధులను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం ఈఎం నాగరాజు, సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ డీజీఎం బాలాజీ భగవతి ఝా, ఎస్‌ఓ జయంత్, డీవైఎస్ఈ ఏ చంద్రమౌళి, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు వీధులలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ద్వారకానగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో కూడా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రబంధకారిణి అధ్యక్షులు రాచకొండ గిరీష్, కార్యదర్శి పాలెపు మురళి, హితైషులు చిలువేరు భాస్కర్ కార్యక్రమ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ద్వారకానగర్ కాలనీలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బంక శివతో పాటు పలువురు పాల్గొన్నారు. స్థానిక గోకుల్‌నగర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్‌లు యాదవ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.



కౌటాల : యాదవుల ఆరాధ్య దైవం శ్రీకృష్ణుడని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా గురువారం మండలకేంద్రంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని యాదవులు ఏర్పాటుచేయడంతో ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్ని కృష్ణుడంటే యాదవులు ఆరాధ్య దైవంగా భావిస్తారని, ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు గట్టయ్య, యాదవులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న తహసీల్దార్

నవతెలంగాణ-తాండూర్

తహసీల్దార్ రోహిత్ కృష్ణాష్టమి సందర్భంగా బ్రాహ్మణ పురోహితులతో కలిసి వేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు. మండలం పాడి పంటలతో సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండాలని కృష్ణాలయంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు దత్తాత్రేయరావు, కో ఆప్షన్ మెంబర్ ఎల్క రామచందర్, తహసీల్దార్ రోహిత్, ఆర్ఐ మురళీధర్‌రావును శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గోపాల్, రాజన్న, దుర్గాచరణ్, ఎస్ రామ్మోహన్‌రావు, బ్రాహ్మణ సేవా సభ్యులు పాల్గొన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నపిల్లలు కృష్ణుడు గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల్లో భజన, ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.

నిధుల మంజూరుకు ఎమ్మెల్యేకు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని వాడిలోద్ది వాగుపై రూ.10.48కోట్ల వ్యయంతో హైలెవెల్ వంతెన నిర్మించడానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే ఆత్రం సక్కును ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామస్తులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి వాగు ప్రవాహంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయని, ఆయనకు ఎప్పుడు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ హైమద్, కోలం సంఘం జిల్లా అధ్యక్షులు ఆత్రం గంగారాం, నాయకులు షాకు, లక్ష్మణ్, కురు, తిరుపతి, మారుతి, గుణవంతరావ్ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని ఖైరిగూడ గ్రామంలో తీజ్ ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. దేశంలో బంజారులకు అతి ముఖ్యమైన పండుగలో తీజ్ పండుగ ఒకటి కావడంతో పెళ్లికాని యువతులు తమ కోరికలు నెరవేరాలని, అదేవిధంగా ఊరిలో పాడిపంటలు మంచిగా పండాలని, అందరు సుఖ సంతోషాలతో ఉండాలని తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలు చేసి గురువారం గోలేటి గ్రామ సమీపంలోని గుండాల వాగులో నిమజ్జనం చేశారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని వారు కోరారు. తీజ్ పండుగకు రాష్ట్ర ప్రభుత్వం కొంత ఆర్థిక సాయం అందించాలన్నారు. బంజార ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్, రామారావు మహారాజ్‌ల సేవలో తీజ్ పండుగ సంవత్సరానికి ఒకసారి సాంప్రదాయకంగా మహిళలు ఘనంగా జరుపుకుంటున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సుబ్బారావు, కారోబార్ ఇందల్, గణపతి, మంగీలాల్, శంకర్, రవీందర్, శంకర్, వసంత్‌రావు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధరలు నియంత్రించి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెరిగిన నిత్యావసర ధరలను నియంత్రించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కేంద్ర పార్టీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి రాకముందు బీజేపీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రటించిందన్నారు. పదేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు దాని ఊసెత్తడం లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యావసర ధరలను రోజురోజుకు పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక పెరుగుతున్న ధరలతో పేదలు ఏమీ కొనలేని స్థితిలో ఉన్నారన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా 65 శాతం గరిష్ట స్థాయికి నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందని, ఈ పాటికే కొన్నింటిని ప్రయివేటీకరించి మరికొన్నింటిని ప్రయివేటీకరించేందుకు రంగం సిద్ధం చేసిందని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా నిధులను తగ్గించారని, వాటిని పెంచడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు చేపట్టాలన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఏడాదికి లక్ష ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. అదాని, అంబాని ఆస్తులను పెంచేలా కేంద్రంలోని బీజేపీ వ్యవహరిస్తు పేదలను విస్మరిస్తుందని మండిపడ్డారు. నిరుద్యోగులకు అవకాశాలు కల్పించేలా నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్రాత్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.సురేందర్, ఆర్.మంజుల, నాయకులు లంక జమున, శకుంతల, ప్రభు, పొచ్చన్న, సురేఖ, భీంరావ్ పాల్గొన్నారు.

కండ్లకు గంతలు కట్టుకొని నిరసన

- నాల్గో రోజుకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. గురువారంతో సమ్మె నాలుగవ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా సమ్మె శిబిరం వద్ద ఉద్యోగులు కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. 510 జీవో అమలు కానీ క్యాడర్లకు బేసిక్ హెచ్ఆర్ఏ, డీఏ అన్ని కలిపి గ్రాస్ సాలరీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్బన్ హెల్త్ సెంటర్స్‌లోని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు సమ్మెలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ అశన్న, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఉద్యోగులు ప్రశాంత్ దేశ్‌పాండే, కిరణ్, విజయ్, నీల, స్రవంతి, విష్ణు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాన్ని ఆదుకోవాలి



కాగజ్‌నగర్ : హైదరాబాద్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ హోంగార్డు మంత్రి రవీందర్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. గురువారం కాగజ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్ మాట్లాడుతూ హోంగార్డులను పర్మినెంట్ చేస్తామని 2017లో సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చకపోవడంతోనే రవీందర్ మనస్థాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డట్లు తెలిపారు. కానిస్టేబుళ్లతో సమానంగా విధులు నిర్వర్తించే హోంగార్డులను పర్మినెంట్ చేయాలని, ప్రతీ నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, సాయిరాం పోల్కర్, రామిళ్ల మహేష్, రేగుంట వేణు, చోహన్, పృథ్వీరాజ్, శేఖర్ పాల్గొన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

సిర్పూర్(టి): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 11న సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలస్థాయి అధికారులు తమ శాఖ నివేదికలు ముందుగా ప్రజాప్రతినిధులకు అందజేయాలని తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి స్వర్ణ ప్రాజెక్టుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1183 అడుగులకు కాగా, ప్రస్తుతం 1182.1 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 4000 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో అప్రమత్తమైన అధికారులు ఒక గేటు ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నది పరివాహక ప్రాంతం ప్రజలు రైతులు పశువులు, గొర్రెలు, మేకలు, మేపటానికి వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదలశాఖ అధికారులు కోరారు.



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-జైనథ్

వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ వైద్యురాలు నైనిత అన్నారు. గురువారం మండలంలో బెల్లూరి కరంజి, లేఖర్‌వాడ, దీపాయిగూడ, పిప్పల్‌గావ్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు వివరించారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తామని అన్నారు.



కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే దంపతులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కృష్ణజన్మాష్టమిని పురస్కరించుకొని పట్టణంలోని గోపాలకృష్ణ మఠంలో ఏర్పాటు చేసిన జన్మాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి రమాదేవితో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదట జల భావి వద్ద వేద పండితుల మధ్య జలానికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం చిన్నారి కృష్ణులతో కలిసి ఉట్టి పగలగొట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో జల వనరులను కాపాడుకుంటూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రాజెక్టుల నిర్మాణాలను చేపడుతూ నీటి వనరులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. చిన్నారుల వేషధారణ ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొనడం సంతోషాన్ని కలిగించిందని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పూర్ణానంద స్వామి, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, కత్రి ప్రమోద్, బండారి దేవన్న పాల్గొన్నారు.

తాంసి : శ్రీకృష్ణాష్టమి వేడుకలను తాంసి, భీంపూర్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. తాంసి మండలంలోని కరంజి, నిపాని, పిప్పల్‌కోటి, పొన్నారి, కప్పర్ల, బండల నాగపూర్, జామిడి గ్రామాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. పొన్నారి గ్రామంలోని కృష్ణ మందిరంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ పూజలు నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషాధారణలో ఆకట్టుకుంటు ఉట్టికొట్టే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయాల కమిటి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

నార్నూర్ : శ్రీకృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు భీంపూర్, మహాగావ్, తాడిహత్నూర్, నాగల్‌కొండ, ఉమ్రి, ఎంపల్లి లంబాండా తండాలో ప్రజలు భోగ్ భండార్ పూజలు చేశారు. భీంపూర్ గ్రామంలో జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ బంజారా సంస్కృతి సాంప్రదాయ బద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా తాడిహత్నూర్ గ్రామంలోని శ్రీ సేవాదాస్ విద్యామందిర్ పాఠశాల చిన్నారులు కృష్ణుడి, గోపికల వేషంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చాలా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాథోడ్ విష్ణు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ విష్ణు, పాఠశాల కరస్పాండెంట్ జాదవ్ ఉమాజీ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లోని కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్

నవతెలంగాణ-ఖానాపూర్

ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న దినసరి, పార్ట్‌టైం కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని వాటిని వెంటనే విడుదల చేయాలని అన్నారు. దినసరి కార్మికులు జిల్లాలో 40 మంది, పార్ట్ టైం కార్మికులు 100 మంది ఉన్నారని అన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు వంటలు చేయడంతో పాటు వివిధ రకాల పనులు ఉదయం నుంచి రాత్రి వరకు శ్రమిస్తున్నారని అన్నారు. కార్మికులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. బంగారు తెలంగాణలో వేతనాలు రెగ్యులర్‌గా ఇవ్వని పరిస్థితి నెలకొందని అన్నారు. కార్మికులు గత 30, 40 సంవత్సరాల నుంచి ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న వర్కర్లను రెగ్యులర్ చేయకుండా కాలయాపన చేయడం సమంజసం కాదని అన్నారు. ప్రభుత్వం కనీసం వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఆశ్రమపాఠశాలలో వర్కర్ల శ్రమ దోపిడికి గురవుతున్నారని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న వర్కర్లకు 10 నెలల వేతనాలు మాత్రమే ఇస్తున్నారని, 12 నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 60ను అమలు చేసి చట్టబద్ధత హక్కులు కల్పించాలని అన్నారు. అంతేకాకుండా దినసరి కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల వర్కర్లతో సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్



మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డితో కలిసి గురువారం మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులు కేటాయించిందని, వాటికి సంబంధించిన పనుల ప్రణాళిక తయారుచేసి పంపాలని ఆదేశించారు. నిర్మల్ మున్సిపాలిటీకి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్(ఎస్‌డీఎఫ్) కింద రూ .25 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.పట్టణ సుందరీకరణ, పార్క్ ఏర్పాటు, లైటింగ్, రోడ్లు, డ్రైనేజీ, శానిటేషన్ తదితర పనులపై అన్ని వార్డులలో పనులు నిర్వహించేందుకు ప్రణాళికతో నివేదిక పంపాలన్నారు. శ్యామ్‌ఘడ్, నర్సాపూర్ టూ సోఫినగర్ రోడ్, 42 వార్డులలో అవసరమైన మౌలిక సదుపాయాల అభివద్ధి పనుల వివరాలు, తహసీల్దార్ కార్యాలయం వెనుక స్పోర్ట్స్ కోర్ట్ తదితర పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ చైర్మెన్ ఈశ్వర్, కమిషనర్ సీవీఎన్ రాజు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-పెంబి

నేరాల ముందస్తు నివారణకు గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నమని సీఐ మోహన్ అన్నారు. గురువారం మండలంలోని లోతొర్యతండాలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాలను ముందస్తుగా నివారించడం కోసం కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అనుమానితులు ఎవరైన కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు సాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రజినీకాంత్, రాజు, ప్రభాకర్, గ్రామస్థులు విలాస్, ప్రకాష్‌రెడ్డి, రోహిదాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్



అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే బీఆర్ఎస్‌లో ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ రూరల్ మండలం న్యూపోచంపహాడ్ గ్రామానికి చెందిన 40 మంది, దిలావర్‌పూర్ మండలానికి చెందిన 30 మంది, నర్సాపూర్ మండలానికి చెందిన 30 మంది, లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ యువజన సంఘాలకు చెందిన పలువురు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు అండగా సీఎం కేసీఆర్ సారధ్యంలో అద్భుతమైన పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. దళితబంధు, బీసీ ఆర్థిక చేయూత, మైనార్టీలకు ఆర్థిక సాయం, రైతు రుణమాఫీతో ఇతర పార్టీలకు చెందిన వారు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ శ్రేణుల్లో కూడా మరింత జోష్ పెరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాసంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతరపార్టీల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ వైపు పరుగులు పెడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యాన్ని కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతిపక్ష నాయకులు పభుత్వ పథకాలు, సంక్షేమం చూసి తట్టుకోలేక అధికార పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. ప్రజలు వాస్తవ పరిస్థితులను గమనిస్తున్నారని, మోసపూరిత నాయకుల మాటలు వినే పరిస్థితుల్లో ప్రజలు లేరని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువతకు నైపుణ్య శిక్షణను అందించి, వారిని ప్రోత్సహించడానికి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. గురువారం పట్టణంలోని విద్యానగర్‌లో శ్రీషిర్డీ సాయి సేవ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్తి విద్యా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సాయిబాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కాగా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్స్, మెహింది, బ్యుటిషియన్, విద్యుత్ పరికరాల రిపేరింగ్, మోటార్ వాహనాల డ్రైవింగ్, టెక్నికల్ విభాగంలో శిక్షణతో పాటు కెరీర్ గైడెన్స్‌పై సైతం తరగతులు నిర్వహించనున్నారు. కోర్స్ ఫీజులో 25 శాతం అభ్యర్థి చెల్లించాల్సి ఉండగా, 75 శాతం రాయితీ కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతకు వృత్తి నైపుణ్య తరగతులు అందించేందుకు సొసైటీ ద్వారా కేంద్రాన్ని ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆయా కోర్సుల్లో సరైన నైపుణ్యం లేక అనేక మంది వెనకబడి పోతున్నారని అన్నారు. ఈ విషయాన్ని గ్రహించి, 75 శాతం ఫీజు రాయితీతో వివిధ అంశాల్లో యువతకు శిక్షణను అందించడం పట్ల అభినందనలు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆసక్తి కలిగిన అంశాల్లో శిక్షణలను పూర్తి చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్ ప్రకాష్, శ్రీషిర్డీ సాయి సేవ సొసైటీ ప్రతినిధులు దెబ్బడి అశోక్, వినోద్, రాజు, దశరథ్ పాల్గొన్నారు.

ముగిసిన తీజ్ ఉత్సవాలు



నవతెలంగాణ-నార్నూర్

పవిత్ర శ్రావణ మాసంలో పౌర్ణమి రోజు నుంచి లంబాడాలు పేరుగాంచిన ప్రముఖ పండుగ, తీజ్, ఉత్సవాలు తండాల్లో తొమ్మిది రోజుల పాటుగా ఘనంగా ప్రారంభమై గురువారంతో ముగిశాయి. పెండ్లి కాని యువతులు రాఖీ పౌర్ణమి రోజు చిమ్మలు రంధ్రం నుంచి తీసిన మట్టిని చూసి అక్కడ పూజలు చేసి ఆ మట్టిని ఇంటికి తీసుకొస్తారు. గ్రామాల్లో ఉన్న జగదాంబదేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయంలోకి వెదురు బుట్టలో ఆ మట్టిని పెట్టి బుట్టలో గోధుమలు చల్లుతారు. పౌర్ణమితో తొమ్మిది రోజులు పాటుగా నవమి రోజు దాకా ఉదయం సాయంత్రం రెండు పూటలు యువతులు స్నానము చేసి తొమ్మిది రోజులు ఉపవాసం ఉండి, కఠోర దీక్షతో వారు వేసిన తీజ్‌ను, బావి నుంచి నీరు తెచ్చి నీరు పోసి పూజలు చేస్తారు. పాటలు పాడి తీజ్ చుట్టు గ్రామ పెద్దలు ఉన్న నాయక్, కరోబారి, గెరియా, డావ్ ఇంటి ముందు నృత్యం చేస్తారు. అనంతరం నవమి రోజు తీజ్‌ను ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, తమ కోరికలు తీర్చాలని, పాడి పంటలు, పండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు తీర్చుకుని, అన్నదానం నిర్వహిస్తారు. చిన్న పెద్ద తేడా లేకుండా యువతీలు, యువకులు సంస్కృతి, సాంప్రదాయం బద్దంగా పాటలు పాడుకుంటూ నృత్యాలు చేస్తూ, నెత్తిమీద తీజ్‌ను ఎత్తుకెళ్లి గ్రామ బయట చెరువులో తీజ్‌ను నిమజ్జనం చేస్తారు. ఈ తీజ్ ఉత్సవాలు వారం రోజుల పాటుగా తండాలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఉట్నూర్ : లంబాడా గిరిజనులు తండాల్లో తీజ్ సంబురాలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ తీజ్‌లో యువతులు సాంప్రదాయ బద్దంగా లంబాడా కులస్తుల దుస్తులు ధరించి, నెత్తిన చిన్న పాటి బుట్టలో మొలకెత్తిన గోదుమలతో నృత్యాలు చేశారు. మండలంలోని పులిమడుగు, ఎన్టీఆర్‌నగర్, పాత ఉట్నూర్ తండాల్లో తీజ్ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఎన్టీఆర్ నగర్‌లో నిర్వహించిన తీజ్ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ పాల్గొని పూజలు చేశారు.



భారత్ జోడో యాత్ర వార్షికోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-నిర్మల్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్ర చేపట్టి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు గురువారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీపార్క్‌లోని బాపూజీ విగ్రహానికి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మినీ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అల్లూరి మల్లారెడ్డిలు మాట్లాడారు. దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, విభజన రాజకీయాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, చైనా దురాక్రమణలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లు భారత్ జోడో యాత్ర కొనసాగించారని అన్నారు. రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రి కావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు జునైద్ మెమన్, నాయకులు అర్జుమాన్ అలీ, నందెడపు చిన్నూ, ఎంబడి రాజేశ్వర్, సబా కలీమ్, మతీన్, మెయిన్, రాకేష్, మాజర్, గణేష్, ప్రతాప్‌రెడ్డి, రాంరెడ్డి, రాజేశ్వర్ గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితునికి సెల్‌ఫోన్ అందజేత

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని బోరిగాం గ్రామనికి చెందిన జాదవ్ రాంచందర్ గత నెలలో తన ఫోన్ పొగోట్టుకున్నాడు. బాదిడి ఫిర్యాదులో సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేసి గురువారం రాంచందర్‌కు ఎస్సై శ్రీకాంత్ సెల్‌ఫోన్ అందించారు. సీఈఐఆర్ పోర్టల్‌లో పోయిన సెల్‌ఫోన్ వివరాలను నమోదు చేసి వాటిని గుర్తించి బాదితులకు అందిస్తున్నామని ఎస్సై తెలిపారు.



పంచాయతీ కార్యదర్శికి సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని సావరి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి సునీల్‌కు ఉద్యోగం రెగ్యులర్ కావడంతో గురువారం గ్రామపంచాయతీలో సర్పంచ్ మోతుబాయి జాకు, ఎంపీటీసీ లక్ష్మి, జెడ్పీటీసీ జంగుబాయి సోము శాలువాతో సన్మానించారు. విధులు సక్రమంగా నిర్వర్తించి, గ్రామాన్ని అభివృద్ధిలో ముందుగా ఉంచాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామంలో కొత్తగా స్తంబాలు ఏర్పాటు చేసి లైట్లను అమర్చారు. పండుగ సందర్భంగా గ్రామంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం అభినందనీయమని సర్పంచ్ గజానంద్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు పొంది మండలానికి మంచి గుర్తింపును తీసుకొచ్చారనీ కొనియాడారు. భవిష్యత్తులో విద్యార్థులకు మంచి విద్య బోధనలు అందించి గొప్ప ఉపాధ్యాయులుగా పేరు తీసుకురావాలని సూచించారు. సన్మాన కార్యక్రమంలో ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, కోఆప్షన్ సభ్యులు దస్తగీర్, పంచాయతీరాజ్ ఏఈఈ ధర్మేందర్ ఆడే, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, పేసా కమిటీ కోఆర్డినేటర్ సికిందర్, హరిచంద్, ప్రకాష్, బాబా ఖాన్, సయ్యద్ ఖాసిం ఉన్నారు.

భయాందోళనలో మలక్‌చించోలి గ్రామస్తులు

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలోని మలక్‌చించోలి గ్రామ అటవీ ప్రాంతంలో చిరుత సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం రాత్రి గ్రామానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి గేదె దూడను చిరుత వేటాడి చంపడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. మేతమేయడానికి వెళ్లిన గేదె దూడను చిరుత తీసుకువెళ్లి చంపి తల భాగాన్ని మాత్రమే తిన్న చిరుత మిగతా భాగాన్ని అక్కడే సమీపంలో ఉన్న చెట్టుపై ఉంచింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీదేవి, బీట్ ఆఫీసర్ వెన్నెల సంఘటన స్థలానికి చేరుకొని చిరుతపులి నడిచిన పాదాల అడుగులను గుర్తించి, ఆనవాళ్లు సేకరించారు. గ్రామస్తులు ఎవ్వరూ అటవీ ప్రాంతం వైపు ఒంటరిగా వెళ్లవద్దన్నారు. పశువులు, గొర్రెలు మేపడానికి, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు అటవీ ప్రాంతానికి వెళ్లవద్దని, గ్రామపంచాయతీ అధ్వర్యంలో డప్పు చాటింపు చేసి ప్రజలను అప్రమత్తం చేశారు.

కొనసాగుతున్న రాష్ట్రీయ పోషణ మాసం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం కొనసాగుతోందని సీడీపీఓ శారద, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోషణ మాసంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీలు తల్లులకు యుక్త వయసు పిల్లలకి పౌష్టికాహారంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మనం తీసుకునే ఆహారంలో ప్రతి రోజూ ఆకు కూరలు పండ్లు, పప్పుధాన్యాలు ఉండేలా చూడాలనీ తగిన పోషకాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. దీంతో చాలా రోగాలకు దూరంగా ఉంటామని సూచించారు. పిల్లల ఎదుగుదలపై తల్లులు చాలా జాగ్రత్తలు పాటించాలని కోరారు. పోషణ మాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు డాగే వందన, లక్ష్మి, ప్రదిపిక ఉన్నారు.

వింధ్య స్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని వింధ్య పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలతో అందరినీ అలరించారు. అదేవిధంగా శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, రమేష్‌లు మాట్లాడుతూ పాఠశాలలో ఇటువంటి పండుగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సాంప్రదాయాలు తెలుస్తాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, భారతి, పల్లవి, సునీత, సుమన్య, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, సాయినాథ్, లావణ్య, మంజుల, సౌజన్య, పూజ, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నవతెలంగాణ-తలమడుగు



పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీఆర్ఎస్ మండల నాయకులు కోరారు. తీజ్ ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం పల్సి(బి)తండా నారాయణ బాబా ఆశ్రమంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారిని సంస్థన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, కేదారేశ్వరరెడ్డి, నారాయణ బాబా సంస్థాన్ అధ్యక్షుడు జాదవ్ కిషన్, గ్రామ సర్పంచ్ అంగూర్, ఉప సర్పంచ్ బలవంత్‌రావ్, మణిరాం, నారాయణ, నవీన్, కేశవ్, పరశురాం, ఉత్తం, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 08, 2023 | www.navatelangana.com

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని అడ గ్రామానికి చెందిన ఆడే శ్రీనిత్య ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో ఆమెను గురువారం మాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శ్రీనిత్య నీట్‌లో 454 మార్కులు సాధించింది. మాజీ ఎంపీటీసీ మాలి సంఘం నాయకుడు ఆదే బాబురావు కుమార్తె కావడం సంతోషకరమని మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు నగోషే శంకర్ అన్నారు. మాలి సంఘం బాలికలు ఎంబీబీఎస్ సాధించడం ఇదే మొదటిసారి అన్నారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం నాయకులు నికోడే రవీందర్, అదే మారుతి, సండే సోమేశ్, గురువుల మారుతి పాల్గొన్నారు.

కాలుష్యం ఏర్పడని వ్యాపారాలపై దృష్టి సారించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాలుష్యం ఏర్పడని పర్యావరణహిత వ్యాపారాలపై ఔత్సాహిక వ్యాపారస్తులు దృష్టి సారించాలని వంజీరి సర్పంచ్ ముంజం రమేష్ సూచించారు. భారతీయ యువశక్తి ట్రస్ట్ సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో గురువారం వంజీరి గ్రామంలో ఔత్సాహిక వ్యాపారస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రకృతికి హాని తలపెట్టకుండా వ్యాపారాలు ఉండాలని, ఆర్థికంగా ఎదగడంతోపాటూ పది మందికి ఉపాధి కల్పించాలని తెలిపారు. సంస్థ ప్రతినిధి ప్రబిన్ లియా మాట్లాడుతూ పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని నూతన వ్యాపారాలు పర్యావరణ హితంగా ఉండాలని తెలిపారు. వ్యాపారాలకు సంబంధించిన నూతన ఆవిష్కరణలను వివరించారు. లోను పత్రాలు, వ్యాపార వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నేరెళ్ల రాజేశ్వర్, భారతీయ యువశక్తి ట్రస్టు ప్రతినిధులు కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మోసపోయిన వ్యాపారి

- వ్యాపారస్తులు తస్మాత్ జాగ్రత్త

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం కూడా పెరిగింది. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ మోసాలు కూడా పెరిగాయి. అలాంటి మోసం ఒకటి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పట్టణంలోని ప్రముఖ హర్డ్‌వేర్ షాపు ఏజెన్సీ నుంచి కాల్ చేసి రేకులు కావాలని ఫోన్ వచ్చింది. సదరు వ్యాపారి రేకులను ఆటో ద్వారా ఏజెన్సీ నిర్వాహకుడు చెప్పిన చోటకు పంపించాడు. అయితే అక్కడ ఎవరు లేకపోవడంతో ఆటో డ్రైవర్ యాజమనికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వ్యాపారి తనకు ఫోన్ చేసిన వ్యక్తికి అక్కడ ఎవరు లేరని చెప్పాడు. రేకులను దించాలని సూచించాడు. అయితే వ్యాపారి డబ్బులు అడగడంతో ముందటి వ్యక్తి ఫోన్ పే ద్వారా రూపాయి పంపించాలని చెప్పాడు. రూపాయి పంపిన తరువాత సదరు వ్యక్తి వ్యాపారికి రెండు రూపాయలు పంపించాడు. రేకుల బిల్లు మొత్తం రూ. 23,400 అయిందని వాటిని పంపించాలన్నాడు. అయితే ఆ వ్యక్తి ఏజెన్సీ నిబంధనల ప్రకారం మొత్తం డబ్బులు పంపించాలని వ్యాపారికి సూచించాడు. అయితే వ్యాపారి ఫోన్ పేలో అంత డబ్బులు లేకపోవడంతో రూ. 2 వేలు చొప్పున రెండు సార్లు ఫోన్ పేద్వారా సదరు వ్యక్తికి పంపించాడు. తరువాత రేకుల డబ్బులు రూ. 23 వేల 400తో పాటు తాను కొట్టిన రూ. 4 వేలు తిరిగి ఇవ్వాలని వ్యాపారి కోరాడు. డబ్బులు కొట్టకపోగ దబయించాడు. తీరా వ్యాపారి మోసపోయినట్లు గమనించి బ్యాంకుకు సమాచారం అందించాడు. అయితే అందుకు సమయం పడుతుందని బ్యాంక్ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

కృష్ణాష్టమి వేడుకలతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు గత పది రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా 11 రోజు గురువారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేశాదారణతో నిరసనలో పాల్గొన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తొడసం శ్రీనివాస్, ఉపాధ్యాయులు చునార్కర్ చైతన్య, రాజ్ కమలాకర్‌లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. అప్పటి వరకు కనీస వేతన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ కుమార్, అధికార ప్రతినిధి పవన్, నాయకులు దుర్గం సందీప్, గాంధీ, రమేష్, మహేష్, రాజేష్, రమణ, తిరుమల, మమత పాల్గొన్నారు.

10న బీసీ సింహగర్జనను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 10న నిర్వహించే బీసీ సింహగర్జనను విజవంతం చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో సింహగర్జనకు సంబంధించిన పోస్టర్లను విడుదుల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి బీసీ అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు రాజకీయంగా చాలా వెనుకబడి ఉన్నారని రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 60 సీట్లు కేటాయించి సీఎం సీటు బీసీలకే ఇవ్వాలని, సామజిక న్యాయం సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలనే నినాదంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభలో బీసీల స్థితిగతులు రాజకీయ భవిష్యత్తు గురించి చర్చిస్తారని, ప్రతి బీసీ బిడ్డ ఈ సభకి పెద్ద ఎత్తున తప్పకుండ హాజరు కావాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు బొట్టుపల్లి ప్రశాంత్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లాహు కుమార్, మల్లేష్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉప సర్పంచ్ ఉప్పల మహేష్, వివిధ బీసీ కులాల నాయకులు బింకరి నారాయణ, కొల అంజన్న, సాయి కిరణ్, గోళం రాజన్న, ఉప్పలం రమేష్, పెద్దపల్లి శంకర్, సత్తయ్య, హరికృష్ణ, ప్రవీణ్, రాజయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మసడే చరణ్ అన్నారు. మండలంలోని సాలెగూడ గ్రామపంచాయతీలో బీఎల్ఓ ఏజెంట్ల నియామకాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఉందని దానితోపాటు ఇతర ఓట్లు కూడా పడేలా చూడాలన్నారు. బీఎల్ఓ ఏజెంట్లు కృషి చేస్తేనే ఓట్లు వస్తాయని ప్రజలను చైతన్యవంతులు చేయడంలో వారి పాత్ర ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి.ఆసిఫ్ అలీ, సోషల్ మీడియా కన్వీనర్ నాయకులు బండు, కిరణ్ పాల్గొన్నారు.



మిషన్ భగీరథ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- ఏడవ రోజుకు చేరుకున్న సమ్మె



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న భగీరథ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, సెప్టెంబర్ 2 నుంచి సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను కంపెనీ యాజమాన్యం పరిష్కరించాలన్నారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తూ కుటుంబ నిర్వహణ భారంగా మారిందన్నారు. అయినప్పటికీ యాజమాన్యాలు ప్రతినెల వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు. యాజమాన్యాలు స్పందించి కార్మికులకు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. కార్మికులను విదుల్లో చేరమని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు తెలిసిందని, సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ యూనియన్ జిల్లా కార్యదర్శి లింగన్న, బాలేశ్, సురేష్, మారుతి, తిరుపతి, దేవేందర్, గౌతమ్, రవీందర్, భీంరావ్, విజయ్ పాల్గొన్నారు.



మిషన్ భగీరథ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

కెరమెరి : మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో మండలంలోని అనర్‌పల్లి చౌరస్తాలోని పంప్ హౌస్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల బుడ్డయ్య మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఎన్నో ఏండ్లుగా మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్నప్పటికీ వేతనాలు సక్రమంగా చెల్లించకుండా కార్మికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యలను పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా పోరాటాలు చేస్తున్నప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవచూపి యాజమాన్యాల ద్వారా ప్రతినెల వేతనాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పోరాటం చేస్తున్న కార్మికులను తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ అర్ధనగ్న ప్రదర్శనలో భీమరాజు పాల్గొన్నారు.

నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు

- టీచర్ల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- డీఎస్సీతోనే నియామకం
- రెండో వారంలో నోటిఫికేషన్
- సీబీటీ విధానంలో పరీక్షకు యోచన

నవతెలంగాణ-కెరమెరి

ఎట్టకేలకు ప్రభుత్వం టీచర్ల భర్తీకి పచ్చ జెండా ఊపింది. గత ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఈ నెల రెండో వారంలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఐదేళ్ల తర్వాత ఉపాధ్యాయ ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 5,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలుపుతూ జీఓ నెంబర్ 96 ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 289 పోస్టులు ఖాళీ ఉండగా, పదోన్నతులు పోను, ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత డీఎస్సీని రద్దు చేసిన ప్రభుత్వం తొలిసారిగా 2017లో టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్టు పేరిట సుమారు 13వేల పోస్టులను రాష్ట్రవ్యాప్తంగా భర్తీ చేసింది. ఈ నియామకాలను కొత్త జిల్లాల ప్రాతిపదికన కాకుండా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చేపట్టింది. ఆ తర్వాత టీచర్ల నియామకాలు చేపట్టలేదు. ప్రభుత్వం ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలను ప్రతి నియోజకవర్గానికి రెండు చొప్పున ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. దీంతో ఖాళీ పోస్టులను భర్తీ చేయలేకపోయింది. విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు తక్కువగా, విద్యార్థులు లేనిచోట ఉపాధ్యాయులు తక్కువగా ఆయా పాఠశాలల్లో ఉండడంతో ఆ సమస్యను వర్క్ ఫర్ అడ్జస్ట్ మెంట్‌లో భాగంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యాబోధన సాగిస్తున్నారు. నియామకాలు చేపట్టనుండడంతో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను కూడా ప్రారంభమైంది. కొత్త జిల్లాలు ఏర్పాటు కావడం, కొత్త జోనళ్లు ఏర్పాటు కావడంతో స్థానికత ఆధారంగా, ఉపాధ్యాయులను ఆయా జిల్లాల నుంచి పంపించేందుకు ప్రభుత్వం జీవో 317 తీసుకవచ్చింది. ఈ మేరకు జిల్లా నుంచి పలువురు ఉపాధ్యాయులు వారి సొంత జిల్లాలకు వెళ్లగా, ఇతర జిల్లాల నుంచి ఆసిఫాబాద్ జిల్లాకు కొందరు ఉపాధ్యాయులు నియమితులయ్యారు. దీంతో జిల్లాలో పనిచేసే ఉపాధ్యాయుల లెక్క తేలింది. ప్రస్తుతం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత మరిన్ని ఖాళీలు ఏర్పడనున్నాయి.

జిల్లాలో మొత్తం ఖాళీలు

జిల్లాకు మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు 2444 కాగా, ప్రస్తుతం 1883 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. లోకల్ బాడీ పాఠశాలలతో పాటు అన్ని కేటగిరీల్లో కలిపి 561 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా విద్యా శాఖాధికారుల సమచారం. ఇదే సమచారాన్ని ప్రభుత్వానికి నివేదించారు. స్కూల్ అసిస్టెంట్ గణితం 27, భౌతిక శాస్త్రం 30, జీవశాస్త్రం 34, సాంఘిక శాస్త్రం 57, ఇంగ్లీష్ 19, తెలుగు 11, హిందీ 11, ఉర్దూ 0, పీడీ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భాషా పండితులు తెలుగు 16, హిందీ 9, వ్యాయామ ఉపాధ్యాయులు ఒకటి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం 45, ఎస్జీటీలు 196 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం స్కూల్ అసిస్టెంట్ ఖాళీ పోస్టుల్లో 30 శాతం భర్తీ ద్వారా, 70 శాతం పదోన్నతుల ద్వారా, ఎస్జీటీ పోస్టులకు వంద శాతం నియాకమాల ద్వారా చేపట్టాల్సి ఉంటుంది, పదోన్నతుల అనంతరం ఖాళీల అసలు లెక్క తేలనుంది.

ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిన పోస్టులు ఇవే

నోటిఫికేషన్‌లో 289 పోస్టులను భర్తీచేసే అవకాశాలున్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 49 ఉండగా, ఎస్జీటీ 216, ఎల్పి13, పిఈటీ 2 పోస్టులు భర్తీ చేయవచ్చని భావిస్తున్నారు. మొత్తం ఖాళీల్లో పదోన్నతులు పోగా ఖాళీ ఏర్పడే పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. జిల్లాలో ఏకో పాధ్యాయ పాఠశాలలు అనేకం ఉన్నాయి. ఐదుతరగతులకు సబ్జెక్టుల వారీగా ఒకే ఉపాధ్యాయుడు బోధించడమనేది కష్టంగా ఉంటుంది. విద్యార్థులకు నష్టం జరుగుతుందని పోస్టులను పెంచి నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతున్నారు. ఈ నియామకాలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుండగా డీఎస్సీలో కలెక్టర్ చైర్మన్‌గా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వైస్‌చైర్మన్‌గా, జిల్లా విద్యాశాఖాధికారి సెక్రెటరీ, సభ్యుడిగా జడ్పీ సీఈఓ ఉంటారు. వారంలోపు డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడితే, ప్రక్రియ పూర్తయ్యే నాటికి ఐదారు మాసాలకు పైగా పట్టనుందని అంటున్నారు.

సీబీటీ విధానంలో పరీక్షలు

త్వరలో టీచర్ల భర్తీ చేసే పరీక్షలను ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్ (సీబీటీ) విధానంలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. ఏక కాలంలో లక్షల మందికి సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాకపోవచ్చని, విడతల వారిగా పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ సారి జిల్లా కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం యోచిస్తోంది.

పోస్టులను పెంచి ఖాళీలను భర్తీ చేయాలి

ఆడె ప్రకాష్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



317 జీఓ వల్ల జిల్లాలోని నిరుద్యోగులకు అన్యాయం జరిగింది. ఇతర జిల్లాలకు చెందిన వారు రావడంతో ఇక్కడ ఉన్న ఖాళీలు భర్తీ అయ్యాయి. ప్రభుత్వం జారీ చేసిన ప్రకటలో తక్కువ ఖాళీలు చూపెట్టారు. ఏకో పాధ్యాయ పాఠశాలల్లో 5 తరగతులకు ఒకే టీచర్ బోధించడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రభుత్వం పోస్టులను పెంచి మెగా డీఎస్సీ నోటిఫికే షన్ జారీ చేయాలి.

భారీ వర్ష సూచనతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉత్తర, తూర్పు తెలంగాణ ప్రాంతాలలో భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ తెలిపారు. తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, వాయువ్య ప్రాంతంలో ప్రత్యేకంగా తూర్పు ఆదిలాబాద్ ప్రాంతాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ప్రజల సంరక్షణకు అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతుందని, భారీ వర్షాల కారణంగా వరద పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల రక్షణకు అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, చెట్ల సమీపంలో ఉండకూడదని, వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లరాదని తెలిపారు. ప్రజలు అత్యవసరం అయితేనే బయటకు రావాలని, వరద పరిస్థితులలో లోతట్టు ప్రాంతాల ప్రజల రక్షణ కొరకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెం.6304686505 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సేవలు, పునరావాస కేంద్రాల వివరాలకు ప్రజలు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఘనంగా ముగింపు తీజ్ ఉత్సవాలు



జైనూర్‌లో..

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు తాండాలలో ముగింపు తీజ్ ఉత్సవాలను బంజారా మహిళలు యువతులు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు పెళ్లి కాని యువతులు అత్యంత భక్తి శ్రద్ధలతో, బొంగు కర్ర బుట్టలో మట్టితో పాటు మొలసిన ధాన్యపు మొక్కలతో సాంప్రదాయ పద్ధతిలో తమ దేవుణ్ణి పూజిస్తారు. గురువారంతో తీజ్ ఉత్సవాల ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో బంజారా మహిళలు, యువతులు మొలకెత్తిన ధాన్యపు గింజలను బుట్టలో వేసుకొని చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మొలకెత్తిన ధాన్యపు మొక్కలతో కూడిన బుట్టలను సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు.

జైనూర్ : ప్రతి ఏడాది నిర్వహించే తీజ్ ఉత్సవాలు గురువారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో లంబాడాలు ఘనంగా నిర్వహించారు. సంస్కృతి సాంప్రదాయాలతో పూజలు నిర్వహించి క్రీడా కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మహిళలు నృత్యాలు చేసి ఒకరికొకరు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం సామూహిక భోజన కార్యక్రమం నిర్వహించారు. లింగాపూర్ మండలంలోని కొత్తపెల్లి(సి) గ్రామంలో హెడ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాదవ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామంలో యువతను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా రేగుంట మహేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా రేగుంట మహేష్ ఎన్నికయ్యారు. కాగజ్‌నగర్ కేంద్రంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి బాలాజీ కాంబ్లే, నాయకుడు రేగుంట సాగర్, సత్యనారాయణల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ప్రతి ఒక్కరు కలిసి రావాలన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఎస్సీ వర్గీకరణకు మాదిగలు కలిసి రావాలని కోరారు తనపై నమ్మకం ఉంచి సెక్రటరీ పదవికి ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పాడుపడ్డ బావిలో పడి మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మతిస్తిమితంలేని వ్యక్తి పాడుబడిన బావిలో పడి మృతి చెందిన ఘటన మండలంలోని చెడ్వాయి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చెడ్వాయి గ్రామానికి చెందిన దందెర మధు(55) అనే వ్యక్తి గత మూడు సంవత్సరాలుగా మానసిక స్థితి బాగులేదు. శనివారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో ఇంటిలో ఎవరికి చెప్పకుండా బడటకి వెళ్లాడు. గ్రామ శివారులోని పాడుబడిన బావి దగ్గరి నుంచి వెళ్తున్న గ్రామస్తులు బావిలో చూడగా మధు మృతదేహం కనిపించడంతో కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య దందెర బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో జడ్పీటీసీ నాగేశ్వరరావు ఎంపీపీ మల్లికార్జున్‌ల అధ్యక్షతన నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. పండగలు వాటిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో నాలుగు టీములు పాల్గొనగా వాంకిడి మండలం ఖమాన టీం సభ్యులు గెలుపొందారు. విజేతలకు నాగేశ్వరరావు తరపున రూ.10116 నగదు బహుమతి అందజేశారు. అంతకుముందు బాపునగర్ నుంచి ర్యాలీగా భాజాభజంత్రీల మధ్య ప్రత్యేక వేషధారణలో కృష్ణుని చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకొని వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, సర్పంచులు భీమేష్, శ్రీనివాస్, నాయకులు నిసార్, రాకేష్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలకేంద్రంలోని శ్రీ రంగనాయక దేవాలయం ప్రాంగణంలో గురువారం శ్రీ కృష్ణా జన్మాష్టమి వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షుడు యు.ఎర్రయ్య కృష్ణుని చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు రమేష్, యాదవ సంఘం నాయకులు బి సత్యనారాయణ, బండ వెంకన్న, చిలుకూరి మధునయ్య, గడ్డం శ్రీనివాస్, శేఖర్, బోరం బుజ్జి పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో ఉట్టి కొడుతున్న ఎమ్మెల్యే సక్కు

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని శివకేశవ ఆలయంలో ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఆనవాయితీగా వస్తున్న అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దహెగాం : మండలకేంద్రంలో దహెగాం యూత్ ఆధ్వర్యంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారాంతపు సంత ఏరియాలో ఉట్టి కొట్టే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పోటీలో మండలకేంద్రానికి చెందిన గుర్లె ప్రకాష్ టీం ఉట్టి కొట్టి ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోగా బహుమతిగా రూ.10,116 వేలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాపర్తి ధనుంజయ్, చపిడె సంజీవ్, గొర్కుట్ మల్లేష్, వడాల సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నస్పూర్ : మున్సిపాలిటీ పరిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పిల్లలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అందర్నీ ఆకట్టుకున్నారు. పలుచోట్ల ఉట్టి కార్యక్రమాలు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈశ వేదజ్ఞ శ్రీకృష్ణుని వేషధారణలో జాతీయ జెండాను పట్టుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఆసిఫాబాద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సక్కు



దహెగాంలో..

చింతలమానేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం కష్టాష్టమి వేడుకలను పురస్కరించుకొని వివిధ ఆలయాల్లో భజన కార్యక్రమం తో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని రవీంద్ర నగర్-1 గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉట్టిగొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉట్టి కొట్టేందుకు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

12వ రోజుకు చేరిన నిరాహార దీక్ష

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త భూమాచారి చేపట్టిన దీక్ష గురువారం 12వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న భూమాచారికి పలు పార్టీలు, సంఘాల నాయకులు పరామర్శించి మద్దతు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న టైగర్ జోన్‌ను ఎత్తివేయాలని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి మండల కేంద్రంలో 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. దీక్షకు మండల వర్తక సంఘం ఆధ్వర్యంలో మద్దతు పలికారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

దేశభక్తి చాటుతున్న నా దేశం-నా మట్టి

నవతెలంగాణ-కాసిపేట

ఆజాదిక అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా దేశం-నా మట్టి కార్యక్రమంతో అందరిలో దేశ భక్తిని కలిగిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి అన్నారు. మేరీ మాటి - మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు కాసిపేట్ మండలంలోని దేవపూర్ గ్రామంలో మండల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏమాజి, జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి జాతీయ జెండాలు చేత బట్టి, కలుషం చేతబూని ఇంటింటికి వెళ్లి మట్టిని సేకరించారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల గురించి, దేశ భక్తి గురించి ప్రజలకు వివరించారు. భారత్ మాతకి జై అంటూ నినాదాలిస్తు ఉత్సాహంగా మట్టి సేకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, జిల్లా నాయకులు దూది ప్రకాష్, పెద్దపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి సంతోష్, రాంచందర్, నర్సింగ్, కలాలీ కృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేసేంత వరకూ పోరాటం

● బీసీ సంఘాల నాయకులు



నవతెలంగాణ-చెన్నూర్

బావురావుపేట శివారు సర్వే నెం. 8లో పేదలు గుడిసెలు వేసుకుని ఐదు నెలలుగా నివసిస్తున్న వారి గుడిసెలను కూల్చి, తగులబెట్టిన బాధితులకు న్యాయం చేసేంత వరకు పోరాటం ఆగదని రజక వృత్తిదారుల సంఘం న్యాయకులు స్పష్టం చేశారు. గురువారం ఆ సంఘం కార్యదర్శి పాయిరాల రాములు ఆధ్వర్యంలో బాధితులను పరామర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ కబ్జా దారులు పేదల గుడిసెలను కూల్చి కాల్చి చేయడం సరికాదన్నారు. అసైన్మెంట్ భూములు భూస్వాములకు దొంగ పట్టాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కబ్జా దారుల పెట్రోలు, డీజిల్, కర్రలతో, పేదల గుడిలను కూల్చివేసి కులం పేరుతో దూషించిన వారిపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, భూకబ్జా దారులు కేసులు పెడితే తక్షణమే స్పందించిన పోలీసు యంత్రాంగం, పేదలు కేసులు పెడితే ఎందుకు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డుబ్బుల కొలుపు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి జునవరి రాజ్ కుమార్ మాట్లాడుతూ పేదలకు ఒక న్యాయం పెద్ద వాళ్లకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. తక్షణమే భూకబ్జాదారులపైన చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే జిల్లావ్యాప్తంగా వివిధ ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజక వత్తిదారుల సంఘం నస్పూర్ మండల కన్వీనర్ సంజీవ్, జనవరి నారాయణ డబ్బులకొలుపు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు సమ్మన్న, జిల్లా సహాయ కార్యదర్శి, గుడిసె వాసులు రమ్య, మనక్క, ఉమారాణి, యామిని, రుక్సానా లక్ష్మి, సుజాత, లీల, రమాదేవి పాల్గొన్నారు.

11 నుంచి సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు



నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రేగుంట చంద్రశేఖర్ కోరారు. గురువారం తాండూరు ప్రెస్ క్లబ్‌లో విలేకరుల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా కమ్యూనిస్టులు భూమినేని నిరుపేదలకు లక్షల ఎకరాల భూమి పంపిణీ చేయడం జరిగిందన్నారు. సాయుధ రైతాంగ పోరాటంలో ఎందరో కమ్యూనిస్టులు అసువులుబాశారని తెలిపారు. నిరుపేదలు రైతుల శ్రేయస్సు కోసం పోరాటం చేసి నేలకొరిగిన కమ్యూనిస్టు నాయకుల జయంతి వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తామన్న ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. కమ్యూనిస్టు భావాలు గొప్పవాని వారి ఏజెండాను అమలు పరుస్తామన్న అధికార యంత్రాంగం దొరల పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మామిడాల రాజేశం, మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, మాజీ ఎంపీపీ కామెరమల్లయ్య, ఎడ్ల గోపాల్ ముత్య శంకర్ పాల్గొన్నారు.

మంత్రి జగదీశ్వర్‌రెడ్డికి లేఖ

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డికి ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్లు గురువారం లేఖ రాశారు. మండల కేంద్రంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సబ్ స్టేషన్ లేక మండలంలోని రైతులు వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలేదని పేర్కొన్నారు. వెంటనే 132 కేవీ సబ్ స్టేషన్ అత్యవసరమని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ లేఖలను బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు అందజేసినట్లు తెలిపారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్(సీఎంఆర్ఎఫ్) భరోసా కల్పిస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన జంజీరాల శ్రీనివాస్‌కు తన క్యాంపు కార్యాలయంలో రూ.60,000 విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ముఖ్య మంత్రి సహాయనిధి నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను శ్రమ దోపిడీ చేస్తున్నాయి

● ఎస్‌సీకేఎస్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కాంట్రాక్టు కార్మికులను శ్రమను దోచుకోవడంలో పోటీ పడుతున్నాయని ఎస్‌సీకేఎస్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ విమర్శించారు. కాంట్రాక్టు కార్మికుల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల వేతనాల పెంపుదలకై పోరుబాటలో భాగంగా శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని ఆర్కే-5 గని, కృష్ణాకాలని సివిల్, ఎస్ఆర్పి ఓసీ కార్మికులతో గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు రెండోసారి కూడా అధికారంలోకి వచ్చిన కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదని, కార్మికుల శ్రమను దోచుకోవడంలో దొందుదొందుగానే వ్యవహరిస్తున్నాయని అన్నారు. కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక్కసారి కనీస వేతనాల జీఓలను ఇవ్వాల్సి ఉన్న 10 సంవత్సరాల నుంచి కనీస వేతనాల జీవోలను విడుదల చేయకుండా కార్పొరేట్లకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీని వలన కార్మికులకు వేతనాలు సరిపోక కుటుంబాలను పోషించుకోలేక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, కార్మికుల ఓట్లతో గెలిచి ఇప్పుడు ఆ కార్మికులను విస్మరించడమంటే ఆ కార్మికుల, వారి కుటుంబాల ఓట్లకు పాలకులు దూరమైనట్లేనని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాల జీఓలు 2022లో ముగిసిన ఇప్పటి వరకు కొత్త జీఓ విడుదల చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్, సంపత్, నరేష్, అంకుస్, రమేష్, అరిఫ్, మల్లయ్య పాల్గొన్నారు.

పార్టీ మారిన జడ్పీటీసీపై అసత్య ఆరోపణలు తగవు

● పుస్కూరి వంశం ఇచ్చేదే కానీ తీసుకునేది కాదు



నవతెలంగాణ-హాజీపూర్

హాజీపూర్ జడ్పీటీసీ శిల్ప-శ్రీనివాస్‌లపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు చేస్తున్న సేవ కార్యక్రమాలకు ఆకర్షితులై హాజీపూర్ జడ్పీటీసీ పుస్కూరి శిల్ప శ్రీనివాస్ రావు కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకనే జడ్పీటీసీపై అసత్య ఆరోణలు చేస్తున్నారని ఆ పార్టీ మండల నాయకులు అన్నారు. గురువారం హాజీపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండల నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు తోనే హాజీపూర్ మండలం అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడం విడ్డురంగా ఉందని ఎద్దేవచేశారు. ఎమ్మెల్యే దివాకర్ రావు వల్లనే మండలంలోని ఏడూ గ్రామాలు ముంపుకు గురై, భూములు, ఇండ్లు కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దివాకర్ రావు అనుచరులు మొరం, భూ దందాలు, ఇసుక మాఫియా చేస్తున్నారని అన్నారు. ప్రేమ్ సాగర్‌రావు ప్రజా సేవ చేయడంతో ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని, దాన్ని జీర్ణించుకోలేకనే బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్ సాగర్ రావుపైన అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే దివాకర్ రావు తోనే నియోజకవర్గ అభివద్ధిలో 20 ఏండ్లు వెనకకు పోయిందన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రేమ్ సాగర్ విజయం సాధిస్తాడని అన్నారు.గెలిచిన 5 ఏండ్లలో 50 ఏండ్ల ముందుకు అభివద్ధి చేసి చూపిస్తామని పేర్కొన్నారు.ఎమ్మెల్యే దివాకర్ రావు హాజీపూర్ మండలంలో అభివద్ధి చెసిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకోవడం కాదని, అభివద్ధి చేస్తే ప్రజలకు చూపించి నిరూపించుకోవాలని సవాల్ చేశారు. .ప్రేమ్ సాగర్ రావు పై ,జడ్పీటీసీ పైన అసత్య ఆరోపణలు చేయడం కాదని,ఆ ఆరోపణలు నిజమైతే నిరూపించడానికి మండల కేంద్రంలోని అంబెద్కర్ విగ్రహం ఎదుట చర్చకు రావాలని సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో పెద్దంపేట సర్పంచ్ పొట్టల సుమలత శ్రీశైలం గౌడ్ ,ఎంపీటీసీలు ఒడ్డే బాలరాజ్ ,డేగ బాపు లు పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ కాపాడుతోంది'

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



రెండు దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలను కాపాడుతున్నది బీఆర్ఎస్ పార్టీనే అని దేవతి శ్రీనివాస్ అన్నారు. మంచిర్యాలలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ అధ్యక్షతన చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేశపతి శ్రీనివాస్ హజర్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర పాలకులు కార్పొరేట్ శక్తులను ఎదిరించి చావు నోట్లో తలపెట్టి తెలంగాణను సాధించిన వ్యక్తి కేసీఆర్ సకలజనుల సమ్మె సింగరేణి సమ్మె వంటి పోరాటాలతో తెలంగాణ సమాజాన్ని ఏక ముఖంగా ఏకం చేసి గమ్యాన్ని ముద్దాడే వరకు సంకల్పంతో కొట్లాడిన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. నోట్ల రద్దు, కరోనా కష్టకాలంలో మోడీ ప్రభుత్వం సహకరించక పోయిన సంక్షేమాన్ని కొనసాగించిన మానవతా మూర్తి కేసీఆర్ అన్నారు. కార్యకర్తలు అందరూ కుటుంబ సభ్యుల్లా ఐకమత్యంతో పని చేయాలని కోరారు. గ్రామ, మున్సిపాలిటీలలోని కుల సంఘాలు, యూనియన్లతో సన్నిహితంగా ఉండాలని వారి సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరే వారిని స్వాగతించాలని నియోజక వర్గంలో రైతుబంధు 10 విడతల్లో 47,855 మంది రైతులకు రూ.505.73 కోట్లు జమ, రైతు భీమా ద్వారా 538 రైతులకు రూ.26.90 కోట్లు, దళితబంధు ద్వారా 100 మందికి, బీసీ ఆర్థిక సాయం కింద 300 మందికి, మైనార్టీ బంధు 27 మందికి అందించామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలోని 282 పాఠశాలల్లో 17,290 మందికి సన్న బియ్యంతో భోజనం పెడుతున్నామన్నారు. స్త్రీ నిధి - 7604 గ్రూపులకు రూ.321.77 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాలలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విధిగా చేపట్టాలని కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ ముందుకుసాగాలని సూచించారు. గ్రామాల వారీగా లబ్ధిదారుల వివరాలు సేకరించి ఆ వివరాలతో గ్రామం మొత్తం కలియ తిరుగుతూ ఇంటి ఇంటి ప్రచారం నిర్వహించాలని మిగిలిన సమస్యలు చేయవలసిన పనుల వివరాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో గెలిచేది బీఆర్ఎస్ పార్టీనేనని, అభ్యద్ధి యజ్ఞం ఇలాగే కొనసాగాలంటే గులాబీ జెండా మళ్లీ తప్పకుండా ఎగరాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా పుల్లూరి మల్లయ్య సంతాప సభ



నవతెలంగాణ-కాసిపేట

పుల్లూరి మల్లయ్య సంతాప సభను గురువారం బెల్లపల్లిలోని సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ హాజరై నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి టౌన్ సెక్రటరీ అదెపు రాజమౌళి, సహాయ కార్యదర్శులు బియ్యాల ఉపేందర్, కొంకుల రాజేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శులు బియ్యాల వెంకటస్వామి, దాసరి తిరుపతి గౌడ్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు అక్కిపల్లి బాపు, గుండా చంద్ర మాణిక్యం, ఎల్తూరు శంకర్, శ్రీధర్, బొంతల లక్ష్మి నారాయణ, రత్నం ఐలయ్య, రత్నం రాజం, బొంకురి రామచందర్, పులిపాక స్వామి దాస్, బందారు శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కోసం మంచిర్యాల బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్ గురువారం దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా పత్తి శ్రీనివాస్ మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థిగా టికెట్ ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మాస్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జంగపెల్లి మల్లయ్య, వైద్య శ్రీనివాస్, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు వీరమల్ల రాజయ్య పాల్గొన్నారు.

మేనేజింగ్ డైరెక్టర్‌కు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

సామ్యూల్ సుధాకర్ సింగరేణి సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా శ్రీరాంపూర్ ఏరియాకు వచ్చిన సందర్భంగా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సామ్యూల్ సుధాకర్ సంస్థలో వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. సింగరేణి సూపర్ బజార్‌లో నిత్యావసర వస్తువులను ఉద్యోగులకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, బెల్లంపల్లి, రామగుండం, కొత్తగూడెం సూపర్ బజార్ డీఎంలు సుదర్శన్, ప్రకాష్, అశోక్, డీవై పీఎంలు రాజేశ్వరరావు, రాజేష్, సీనియర్ పీఓ పి కాంతారావు, పీఓఏ బాపయ్య పాల్గొన్నారు.

బాల్క సుమన్‌ను కలిసిన పద్మశాలి సంఘం నాయకులు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను గురువారం పద్మశాలి సంఘం అధ్యక్షుడు వనం సత్యనారాయణ, కమిటీ సభ్యులు కలిసి ఆయనను సన్మానించారు. మరో సారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న సందర్భంగా తన క్యాతనపల్లిలోని ఆయన స్వగృహంలో కలిశారు. అనంతరం సంఘ అభివృద్ధికి మార్కండేయ స్వామి దేవాలయానికి సరిపడా స్థలం ఇప్పించి రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని కోరారు. బాల్క సుమన్ దేవాదాయ శాఖ మంత్రితో మాట్లాడి దేవాలయానికి నిధులు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని అన్ని విధాలుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పట్టణ పద్మశాలి సంఘం తరపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు తిరుపతి, స్టీరింగ్ కమిటీ సభ్యులు బొద్దుల మల్లేష్, ఇప్పకాయ లింగయ్య, బూర సారంగపాణి, కోశాధికారి వేముల వెంకటేశం, మాజీ జనరల్ సెక్రెటరీ కొక్కుల సతీష్, సహాయ కార్యదర్శి బండారి రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మెరుగు రమేష్, నుల్గొండ సత్యం, శ్రీనివాసు వెంకటస్వామి, వైకుంఠం రవి పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో భారత్ జోడో విజయోత్సవ యాత్ర

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లిలో గురువారం నిర్వహించిన భారత్ జూడో విజయోత్సవ పాదయాత్రలో మాజీ మంత్రి గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర నాయకత్వ విదానాలతో దేశ అభివృద్ధి తిరోగమనంలో ఉందన్నారు. అభివృద్ధికి బదులుగా మత విద్వేశాలు సృష్టిస్తున్న వారి నుంచి దేశాన్ని కాపాడుతూ, దేశ ప్రజలంతా ఐక్యంగా ఉంచాలనే గొప్ప ఆశయంతో భారత్ జోడో యాత్ర చేపట్టి, యాత్రలో 12 రాష్ట్రాలతో పాటుగా, 2 కేంద్ర పాలిత ప్రాంతలను కలుపుకుంటూ కొన్ని కోట్ల మంది ప్రజల అభిమానాలను సొంతం చేసుకుని కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర చేపట్టిందన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్ ఆశయాలను లక్ష్యాలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ప్రజలు రాహుల్ గాంధీని వచ్చే ఎన్నికల్లో భావి ప్రధానిగా బాధ్యతలు అప్పగించేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు.

ప్రజలకు అసౌకర్యాలు కలిగిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-జన్నారం

ప్రజల సౌకర్యాలకు, విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జన్నారం ఎస్సై పి.సతీష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని సంగీత మొబైల్ షాప్ ముందర కరెంటు స్తంభంకు షాక్ తగిలి ఒక గొర్రె చనిపోవడంతో, దాన్ని నిరసిస్తూ రోడ్డుకు అడ్డంగా వాహనాలను ఎటువంటి అనుమతి లేకుండా అడ్డుకొని ప్రజలకు వాహనాదారులకు అసౌకర్యానికి గురిచేసి ధర్నా చేసినటువంటి సల్ల మహేష్, దాసరి తిరుపతి, మూగల వెంకటేష్, గట్టు మహేష్, కొండపల్లి మహేష్, మరికొంతమంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా ముందస్తు అనుమతి లేకుండా రోడ్డుపైన ధర్నాలు చేయడం ప్రజలకు వాహనదారులకు అసౌకర్యానికి గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పశువులను రోడ్లపై వదిలితే చర్యలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పగలు, రాత్రి సమయాల్లో పశువులను ఇంటికి తీసుకెళ్లకుండా రోడ్లపై విడిచిపెట్టడంతో రాత్రి పంట పొలాలను నాశనం చేస్తున్నాయని, పశువులను పశు యజమానులు ఇండ్లలో కట్టేసుకోవాలని ఎస్సై కొమురయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రోడ్డుపై ఆవులు, ఎద్దులు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, పశువుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుపై విడిచిపెడితే గ్రామ పంచాయతీ బంజరుదొడ్డిలో వేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పశు పోషకులు తమతమ పశువులను ఇంటికి తీసుకెళ్లాలని ఆయన కోరారు.

అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా : జాన్సన్ నాయక్

నవతెలంగాణ-సిరికొండ

ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గంతో పాటు సిరికొండ మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఫకీర్ నాయక్ తండ, ధర్మసాగర్, చిమ్మన్ గుడి గ్రామాలలో తీజ్ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు లంబాడా నృత్యాలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ఎంతో పవిత్రంగా జరుపుకునే తీజ్ వేడుకల్లో గ్రామస్తులతో కలిసి పాలుపంచుకోవడం గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. గిరిజన గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాదవ్ లచ్చిరాం, లక్ష్మీ దినేష్, బాలాజీ, సునీల్, మసూద్, జిలానీ, సంజీవ్, తారాసింగ్, బిక్కు, రోహిదాస్ పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని పల్సి(బి) తాండ గ్రామంలో తీజ్ ఉత్సవాలను ఘనంగా జరిపారు. ఆటపాటలతో తీజ్ ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంగూర్, బీఆర్ఎస్ నాయకులు పిడుగు సంజీవరెడ్డి, కేదారేశ్వర రెడ్డి, ఆసమ్ రవీందర్, శ్రీకాంత్, రమాకాంత్, గ్రామస్తులు జాదవ్ కిషాన్, మణిరాం, బలవంత్‌రావ్, నవీన్, నారాయణ, మహిళలు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-నిర్మల్

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారిని మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్ సన్మానించారు. గురువారం ప్రియదర్శిని నగర్, సాగర్ కాలనీకి చెందిన సాగర్ రెడ్డి, సాయన్న, దశరథ్, అంబారావు ఉపాధ్యాయులు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని కాలనీలోని కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో శాలువాలతో సన్మానించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీలోని సమస్యలపై కాలనీవాసులు మున్సిపల్ చైర్మెన్ దష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కాలనీ అభివద్ధి కమిటీ సభ్యులు కూన రమేష్, సాగర్ రెడ్డి, వంశీధర్, ఎం.శ్రీనివాస్, శరత్ చంద్రారెడ్డి, విజయ్ కుమార్, నర్సయ్య, బద్రి నర్సయ్య, మహేష్, శ్రీనివాస్, ఆనంద్, రమేష్, పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరికలు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో భారీగా చేరిన నాయకులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

అసెంబ్లీ ఎన్నికల వేళ ఇతర పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో నిర్మల్ రూరల్ మండలం న్యూ పోచంపహాడ్, దిలావర్‌పూర్, నర్సాపూర్, లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్‌లను వీడి గులాబి గూటికి చేరారు. అదేవిధంగా అంబేద్కర్ యువజన సంఘాలకు చెందిన పలువురు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నిర్మల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు అండగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని, దళితబంధు, బీసీ, మైనార్టీలకు ఆర్థిక సహాయం, రైతు రుణమాఫీతో లాంటి పథకాలు విజయవంతంగా సాగుతున్నాయన్నారు. వాటిని చూసి ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో వలస వస్తున్నారని పేర్కొన్నారు. శ్రేణుల్లో కూడా మరింత జోష్ పెరిగిందని, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాసంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వ పథకాలు, సంక్షేమం చూసి తట్టుకోలేక అధికార పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలు వాస్తవ పరిస్థితులను గమనిస్తున్నారని, మోసపూరిత నాయకుల మాటలు నమ్మె పరిస్థితుల్లో లేరని వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, ఇన్‌చార్జి సురేందర్ రెడ్డి, కన్వీనర్ కష్ణ రెడ్డి, జడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడ్వాల రమేష్, సర్పంచ్ సుక్కు రాజవ్వ ముత్తన్న, మాజీ సర్పంచ్ మేకల రాజేందర్ యాదవ్ పాల్గొన్నారు.

భారత్ జోడో యాత్ర చారిత్రాత్మక ఘట్టం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జూడో యాత్ర చారిత్రాత్మక ఘట్టమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. భారత్ జోడోయాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, విభజన రాజకీయాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, చైనా దురాక్రమణలకు వ్యతిరేకంగా భారతదేశాన్ని ఏకం చేయడమే లక్ష్యంగా రాహుల్ గాంధీ యాత్ర చేపట్టారని తెలిపారు. రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంజీవ్ రెడ్డి, భరత్ వాఘ్మారే, నగేష్, చరణ్ గౌడ్, సామ రూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

బేల: బేల మండల కేంద్రంలో చేపట్టిన సంఘీభావ పాదయాత్రలో కాంగ్రెస్ రాష్ట్రనాయకులు కంది శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఓ ఫంక్షన్ హాల్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు చేపట్టిన ఈ పాదయాత్రలో భారీ సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు. కాంగ్రెస్ జెండాల రెపరెపలతో పాదయాత్ర ఆద్యంతం త్రివర్ణ శోభితమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సెప్టెంబర్ 7న కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు 12 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల గుండా 145 రోజుల పాటు 4081కిమీ యాత్ర సాగిందన్నారు. కార్యక్రమంలో గిమ్మ సంతోష్, షకీల్, రాజ్ మొహమ్మద్, షేక్ మన్సూర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లె, మాజీ మార్కెట్ చైర్మన్ వామన్ వాంఖడే, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండవార్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మడవి చంద్రకాంత్, మాజీ మండల అధ్యక్షుడు బాపూరావ్ హుల్కె పాల్గొన్నారు.

గోలేటి డిస్పెన్సరీ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో సింగరేణి డిస్పెన్సరీని గురువారం బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిస్పెన్సరీ ఆవరణలోని వసతులను పరిశీలించి. మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఫర్నీచర్‌ను పరిశీలించారు. డిస్పెన్సరీకి వచ్చే కార్మికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, రోగులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సివిల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్ సతీష్‌బాబు, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, వైద్యులు స్టాలిన్‌బాబు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో ఎన్నో ఉపయోగాలు

నవతెలంగాణ-కాసిపేట

సీసీ కెమెరాలతో ఎన్నో ఉపయోగాలున్నాయని ఎస్సై గంగారాం తెలిపారు. సోమగూడెం కల్వరీ చర్చ్ ఎదురుగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా 6 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గురువారం వాటిని ప్రారంభించి పని తీరును పరిశీలించారు. సీసీ కెమెరాలతో ఎటువంటి నేరాలు జరిగినా నేరస్థులను గుర్తించడానికి అవకాశం ఉంటుందని ఎస్సై అన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోపడుతాయన్నారు. ప్రతి కాలనీలో వీటిని అమర్చుకోవాలని సూచించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పర్యటనున్నారని మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 1గంటకు లంబాడితాండ (కే), మల్కేపల్లి, రొట్టెపల్లి గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు, సీసీ రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఆటపాటలతో ఉద్యోగుల నిరసన

- పదో రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షలు
- కృష్ణుడికి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆ సంఘం జిల్లా ప్రతినిధి పార్థసారథి డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ సమగ్రశిక్షలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట టెంట్ వేసుకుని 10 రోజులుగా సమ్మె చేపడుతున్నారు. రోజుకో కార్యక్రమం చేపట్టి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. గురువారంతో సమ్మె పదవ రోజుకు చేరుకుంది. శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని సమ్మె శిబిరం వద్ద నుండి కోలాటాలు ఆడుతూ ఎన్టీఆర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ మానవహారంగా ఏర్పడి కోలాటాలు ఆడుతూ నిరసన తెలిపారు. కృష్ణుని వేషధారణతో కన్నయ్యకు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ మినిమం టైం పేస్కేల్ కల్పించాలని కోరారు. పది లక్షల జీవితబీమా, ఆరోగ్యబీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు ప్రభుత్వం వివిధ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుంటే విద్యార్హతలు, అనుభవం ఉన్న సమగ్ర శిక్షలోని ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను నెరవేర్చేవరకూ తమ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు.



ఉపాధ్యాయ సంఘాల సంఘీభావం

కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న వీరి సమ్మెకు పలు ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. టియుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయిరి శ్రీకాంత్ జలంధర్‌రెడ్డి మద్దతు తెలిపారు. అలాగే రూ.11500 ఆర్థిక సాయం అందజేశారు. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్‌తో పాటు వివిధ మండలాల బాధ్యులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సరైన సమయంలో పోరాటం చేస్తున్నారని, సంఘటితంగా ఉధృతంగా పోరాటం చేస్తే ప్రభుత్వం దిగిరాక తప్పదని వెంకట్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి

- జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మీ
- శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్



నవతెలంగాణ-కెరమెరి

బీఆర్ఎస్‌తోనే మారుమూల గ్రామాల అభివృద్ధి సాధ్యమని జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మీ అన్నారు. గురువారం మండలంలోని ఖైరి, నెహ్రూనగర్, కెరమెరిలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. ఖైరి గ్రామంలోని హనుమాన్ టెంపుల్‌లో ఏర్పాటు చేసిన ఉట్టి కార్యక్రమంలో పాల్గొని ఉట్టి కొట్టారు. ఈ సందర్భంగా ఖైరి గ్రామస్తులు పలు సమస్యలను జడ్పీ చైర్ పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు సానుకూలంగా స్పందించిన జడ్పీచైర్ పర్సన్ ఖైరి గ్రామంలోని పులాజీ బాబా ధ్యాన మందిరానికి ప్రహరి గోడ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి మరో ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తానని ప్రకటించారు. గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి 20లక్షల రూపాయలతో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడ్తానన్నారు. ఖైరి గ్రామం నుండి శ్మశాన వాటిక వరకు 3కిలోమీటర్ల మేరకు, ఖైరి నుండి అగర్వాడ గ్రామం వరకు 3కిలో మీటర్ల పొడవునా గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల అభివద్ధి ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. అంతకుముందు ఖైరి గ్రామస్తులు జడ్పి చైర్‌పర్సన్‌కు ఘన స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. కెరమెరి, నెహ్రూనగర్‌లో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని మహిళలతో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందూర్ మోతీరాం, జడ్పిటీసీ సెడ్మకి ద్రుపతబాయి, ఖైరి సర్పంచ్ లెన్గూరే విజయలక్ష్మిబాలాజీ, కెరమెరి సర్పంచ్ రాథోడ్ బయనబాయి ఉత్తం నాయక్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- పాల్గొన్న పలు పార్టీల నాయకులు
- కృష్ణుడి విగ్రహంతో పట్టణంలో శోభాయాత్ర



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ధర్మం వైపే నిలబడాలన్న శ్రీకృష్ణ తత్వాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, తద్వారా మెరుగైన సమాజ నిర్మాణానికి పాటుపడాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. కృష్ణ జన్మాష్టమి వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పట్టణ ప్రధాన వీధుల గుండా డీజే చప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని అందంగా అలంకరించి శోభాయాత్ర చేపట్టారు. అనంతరం సంఘ భవనం వద్ద నిర్వహించిన వేడుకల్లో భాగంగా చిన్నారుల శ్రీకృష్ణ, గోపికల వేషధారణలు అలరించారు. అనంతరం చిన్నారులు ఉట్టి కొట్టి సందడి చేశారు. ఎమ్మెల్యే చిన్నారులతో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనాదిగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు తెలియచెప్పేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గోడం నగేష్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, ప్రముఖ హోమియోపతి వైద్యులు రవికిరణ్ యాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు రఘువీర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి హన్మండ్లు యాదవ్, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, రమేష్ యాదవ్, సురేందర్, ప్రఫుల్ పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో



గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పొన్న ఎక్స్‌రోడ్‌లోని శ్రీ వివేకానంద పబ్లిక్ స్కూల్‌లో చిన్న పిల్లలు కృష్ణుడు, గోపిక వేషధారణలతో ఉట్టి కొట్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆడే రాంప్రసాద్, ఉపాధ్యాయులు స్వాతి, దయానంద్, సుకన్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని ఆయా గ్రామాల్లో కృష్టామి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కాగా సుంకిడి గ్రామంలో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అభ్యర్థి అనిల్ జాదవ్ పాల్గొని ప్రత్యక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్ యాదవ్, మండల బీఆర్ఎస్ నాయకులు పిడుగు సంజీవరెడ్డి, కాటుపల్లి వసంత్ రెడ్డి, కేదారేశ్వర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి, లింగి, తాంసి, తలమడుగు సర్పంచులు పొచ్చన్న, కష్ణ, కర్ణకర్ రెడ్డి, గ్రామ అభివద్ధి కమిటీ చైర్మెన్ ఆసం రవీందర్, మణిరాం, రజినీకాంత్ రెడ్డి, రమాకాంత్, సతీష్ రెడ్డి, సుభాష్, జావిద్, మాజీ సర్పంచ్ వెంకన్న, దేవేందర్ రెడ్డి, నర్సింలు, ఆశన్న, ఇమ్రాన్ ఖాన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సుంకిడిలో పూజలు

కృష్టామి వేడుకలను పురస్కరించుకోని మాజీ ఎంపీ నగేష్, జడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి రాజు మండలంలోని సుంకిడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్, మాజీ జడ్పీటీసీ జక్కుల ప్రభాకర్, బజార్హత్నూర్ సొసైటీ చైర్మెన్ వెంకన్న, నాయకులు కనపర్తి చంద్రకాంత్, వన్నెల కిష్టాన్న, తిరుపతి, తిరుపతి రెడ్డి, విలాస్ యాదవ్, రఫీక్, వెంకటస్వామి, రాకేష్, చారి, మహేందర్, కిరణ్ పాల్గొన్నారు.

సమాజసేవే మా లక్ష్యం

- సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మడావి భీంరావు



జైనూర్ : సమాజసేవే తమ లక్ష్యమని, అందుకే రాజకీయంలో పనిచేస్తున్నామని మండల సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మడావి భీంరావు, ప్రధాన కార్యదర్శి మెస్రం రాహుల్ అన్నారు. గురువారం చారిత్రాత్మక గ్రామమైన మార్లావాయి గ్రామ పంచాయతీలోని గుస్సాడీ ట్రెనింగ్ సెంటర్ కార్యాలయం వద్ద జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన ఆదివాసీ సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్‌లు రాజకీయంలోకి సమాజ అభివృద్ధి కోసమే వచ్చామని తెలిపారు. మూడు మండలాల సర్పంచ్‌లు ఏకమై ప్రత్యేక సభను నిర్వహించడం జరిగిందన్నారు. ఆదివాసుల అభివృద్ధి, విద్యతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే సభ ఉద్దేశమన్నారు. మూడు మండలాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానాలు చేశామన్నారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిర్పూర్(యు) మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆత్రం జాలింషావ్, లింగాపూర్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కనక జ్యోతిరావు, మూడు మండలాలకు చెందిన సర్పంచ్‌లు శ్యాంరావు, నాగోరావు, వీనాబాయి, కనక ప్రతిభ, సిడాం భీంరావు, ఆత్రం లక్ష్మణ్, జుగాజీ, మనోహర్ పాల్గొన్నారు.